

మాట్లాడుతున్న రైతుబంధు సమితి మండలాధ్యక్షుడు చెరుకుపెల్లి రాజిరెడ్డి

## రైతు రాజ్యం కేసీఆర్‌కే సాధ్యం

- మూడోసారి అధికారంలోకి బీఆర్ఎస్
- రైతుబంధు సమితి మండలాధ్యక్షుడు చెరుకుపెల్లి రాజిరెడ్డి

ఇల్లంతకుంట, అక్టోబరు 19: తెలంగాణ రాష్ట్రంలో మూడోసారి అధికారంలోకి వస్తుందని, రాష్ట్రంలో రైతురాజ్యం కేసీఆర్‌తోనే సాధ్యమవుతుందని రైతుబంధు సమితి మండలాధ్యక్షుడు చెరుకుపెల్లి రాజిరెడ్డి అన్నారు. గురువారం మండలకేంద్రంలోని జడ్పీ వైస్‌చైర్మన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పాలనలో రైతులను హరిగోస పెట్టింది మరిచిపోలేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు నిరంతరం 24 గంటల కరెంట్ ఇస్తూ రైతులకు అండగా నిలిచిందన్నారు. రైతులకు ఉచిత కరెంటుతోపాటు, సాగునీరు, రైతుబంధు, రుణమాఫీ పథకాలను అందిస్తుందన్నారు. అన్ని వసతులు కల్పిస్తున్న బీఆర్ఎస్‌కు భారీ మెజార్టీ అందించి, మానకొండూర్ ఎమ్మెల్యేగా రసమయి బాలకిషన్‌ను మూడోసారి గెలిపించాలన్నారు. కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ మల్లుగారి రవీందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పల్లె నర్సింహారెడ్డి, సర్పంచ్ మల్లారెడ్డి, ఎంపీటీసీ గొట్టెపర్తి పరశురాం, నాయకులు సత్యనారాయణరెడ్డి, సత్తిరెడ్డి, ఆనంద రెడ్డి, రమేశ్ ఉన్నారు.

## కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి

- కలెక్టర్‌ను కోరిన ప్యాక్స్ చైర్మన్ బాపురావు



కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న సహకార సంఘం చైర్మన్ బాపురావు

ముస్తాబాద్, అక్టోబర్ 19: వరి కోతలు ప్రారంభమైనందున రైతులు నష్టపోకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతికి విన్నవించినట్లు పోతుగల్ సహకార సంఘం అధ్యక్షుడు తన్నీరు బాపురావు, ఎల్లారెడ్డిపేట సహకార సంఘం చైర్మన్ కృష్టారెడ్డి తెలిపారు. గురువారం టెస్కాబ్ అధ్యక్షుడు కొండూరు రవీందర్‌రావు సూచనల మేరకు జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ అనురాగ్ జయంతిని కలిసి రైతుల పరిస్థితి వివరించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను తొందరగా ప్రారంభించాలని కోరారు. సొసైటీకి సంబంధించి కన్స్యూమర్ పెట్రోల్ బంక్‌లను రిటైల్ బంక్ లుగా మార్చడానికి ఎన్‌వోసీ వెంటనే ఇవ్వాలని కోరారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించారు.

## అసిస్టెంట్ ప్రభుత్వ న్యాయవాదికి సన్మానం



గంట అంజయ్యను సన్మానిస్తున్న వెంకటస్వామి

సిరిసిల్ల, అక్టోబర్ 19: తెలంగాణ ఉద్యమకారుడు, న్యాయవాది గంట అంజయ్యకు అసిస్టెంట్ ప్రభుత్వ న్యాయవాదిగా నియామకమయ్యారు. నియామకం సందర్భంగా సిరిసిల్ల బీసీ స్టడి సర్కిల్ డైరెక్టర్ జెల్ల వెంకటస్వామి ఆయనను సన్మానించారు. గురువారం సిరిసిల్ల బీసీ స్టడి సర్కిల్‌లో గంట అంజయ్యను శాలువాతో సత్కరించారు. అంజయ్య నియామకం పట్ల వెంకటస్వామితో పాటు కార్యాలయ సిబ్బంది అంజయ్యకు అభినందనలు తెలిపారు.

## ఆత్మీయ సభకు తరలిన దివ్యాంగులు

సిరిసిల్ల రూరల్, అక్టోబర్ 19: హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో గురువారం జరిగే దివ్యాంగుల ఆత్మీయ సభకు జిల్లా నుంచి దివ్యాంగ సమితి నాయకులు బయలుదేరి వెళ్లారు. దివ్యాంగ సమితి నాయకులు దొంతినేని చంద్రారావు, నులుగొండ శ్రీనివాస్ ఆధ్వర్యంలో రాజన్నసిరిసిల్ల జిల్లాలోని దివ్యాంగులు బయలుదేరి వెళ్లారు.

# సిరిసిల్లలో కేటీఆర్ పోటీ చేయడం అదృష్టం

- ప్రజా ఆశీర్వాద సభను విజయవంతం చేసిన కార్యకర్తలకు కృతజ్ఞతలు
- రైతుబంధు మండలాధ్యక్షుడు కల్వకుంట్ల గోపాల్‌రావు



ముస్తాబాద్: బీఆర్ఎస్ కార్యాలయంలో మాట్లాడుతున్న రైతుబంధు మండలాధ్యక్షుడు కల్వకుంట్ల గోపాల్‌రావు

ముస్తాబాద్, అక్టోబర్ 18: జిల్లా ముఖ చిత్రాన్నే మార్చిన మంత్రి కేటీఆర్ సిరిసిల్ల నుంచి పోటీ చేయడం ఇక్కడి ప్రజల అదృష్టమని రైతుబంధు మండలాధ్యక్షుడు కల్వకుంట్ల గోపాల్‌రావు అన్నారు. పదేండ్ల క్రితం జిల్లా పరిస్థితి చూసిన ప్రజలు బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన తొమ్మిదేండ్ల అనంతరం మంత్రి కేటీఆర్ చేసిన అభివృద్ధిని గమనించాలని సూచించారు. కేటీఆర్‌ను ప్రజలు మరోసారి ఆశీర్వదించి భారీ మెజార్టీని అందించాలని పేర్కొన్నారు. మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్‌కు ఓటు వేస్తే కాగడలే దిక్కు అని, కరెంటు కోసం వ్యవసాయ బావుల వద్ద కావాలి ఉండాల్సిన పరిస్థితి వస్తుందని వాపోయారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం కేసీఆర్ నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభను విజయవంతం చేసిన మండల ప్రజలకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. బీఆర్ఎస్ మ్యానిఫెస్టోపై సబ్బండ వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ముస్తాబాద్ బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు ఎద్దండి నర్సింహారెడ్డి, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ కనమేని శ్రీనివాస్‌రెడ్డి, మండల కో-ఆప్షన్ మాజీ సభ్యుడు అన్వర్, బైతి నవీన్, నాయకులు మెంగాని మనోహర్, యూత్ మండలాధ్యక్షుడు శీలం స్వామి, జహీంగిర్, బాలయ్య, చుంచు బాబు, నాయకులు పాల్గొన్నారు.

### బీఆర్ఎస్‌ను విమర్శించడం హాస్యాస్పదం

ఎల్లారెడ్డిపేట, అక్టోబర్ 19: బీఆర్ఎస్‌ను రాహుల్ గాంధీ విమర్శించడం హాస్యాస్పదమని ఏఎంసీ మాజీ చైర్మన్ అందె సుభాశ్ అన్నారు. గురువారం జడ్పీటీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అభివృద్ధిని చూసి ఓర్వలేక అర్థం లేని విమర్శలు చేస్తున్నారని దుయ్యబట్టారు. ఇక్కడ జడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, ఎంపీపీ పిల్లి రేణుక, నాయకులు ఉన్నారు.

# సిరిసిల్ల ఆర్టీసీలో బతుకమ్మ సంబురాలు

కలెక్టరేట్, అక్టోబర్ 19: సిరిసిల్లలోని ఆర్టీసీ డిపోలో డిపో మేనేజర్ మనోహర్ ఆధ్వర్యంలో ఘనంగా బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. మహిళా ఉద్యోగులు డిపోలో ఆర్టీసీ లోగోతో కూడిన బతుకమ్మను అలంకరించి ఆడారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టీఐ సారయ్య, ఎల్.రాంరెడ్డి, వెల్ఫేర్ కమిటీ సభ్యులు మల్లేశ్, నర్సయ్య, మహిళా ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

### రెడ్డి సంఘంలో బతుకమ్మ సంబురాలు

గంభీరావుపేట, అక్టోబర్ 19: మండల కేంద్రంలోని రెడ్డి సేవా సంక్షేమ సంఘంలో గురువారం బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించుకున్నారు. సంఘ భవనంలో సామూహికంగా మహిళలు తీరొక్క పూలతో పెద్దగా బతుకమ్మను పేర్చారు. అనంతరం సంఘ సభ్యులందరూ సంప్రదాయకంగా కలసి సహ పంక్తి భోజనాలు చేశారు. సాయంత్రం ప్రధాన కూడలి వద్ద బతుకమ్మను పెట్టి ఆడారు. గ్రామ శివారున నమాజ్ చెరువు వద్దకు మహిళలు కోలాటాలు ఆడుతూ బతుకమ్మను తీసుకుపోయి నిమజ్జనం చేసి వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు.



సిరిసిల్ల ఆర్టీసీ డిపోలో బతుకమ్మ సంబురాలు చేస్తున్న ఉద్యోగులు



గంభీరావుపేటలో బతుకమ్మ సంబురాల్లో రెడ్డి సంఘం మహిళలు

## గోపాల్‌రావుపల్లెలో చిరుత సంచారం

- భయాందోళనలో గ్రామస్తులు

సిరిసిల్ల రూరల్, అక్టోబర్ 18: తంగళ్లపల్లి మండలం గోపాల్‌రావుపల్లెలో చిరుత సంచరించిన ఆనవాళ్లు కనిపించాయి. ఈ మేరకు గురువారం గోపాల్‌రావుపల్లెలో ఆవుపై చిరుత దాడి చేసి హతమార్చింది. గ్రామానికి చెందిన రైతు బెంద్రం బాల్‌రెడ్డికి చెందిన ఆవుపై బుధవారం రాత్రి చిరుత దాడి చేయగా ఆవు మృతి చెందినట్లు బాల్‌రెడ్డి తెలిపాడు. ఆవు మృతితో ఆవేదన వ్యక్తం చేసిన రైతు బాల్‌రెడ్డి తనను ఆదుకోవాలని కోరారు. కాగా చిరుత సంచారంతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. ఫారెస్టు అధికారులు చిరుతను పట్టుకుని గ్రామస్తులను రక్షించాలని వారు కోరారు.

## ప్రొటోకాల్ పాటించలేదని ఫిర్యాదు

వేములవాడ రూరల్, అక్టోబర్ 19: వేములవాడ రూరల్ మండలం లింగంపల్లి గ్రామ పంచాయతీ భవనం ప్రారంభోత్సవంలో ప్రొటోకాల్ పాటించలేదని వేములవాడ రూరల్ సెస్ డైరెక్టర్ ఆకుల దేవరాజు పంచాయతీ రాజ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సెస్ డైరెక్టర్ దేవరాజు మాట్లాడారు. గ్రామంలో ప్రభుత్వ నిధులతో గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించగా శిలాఫలకంపై తన పేరు లేదన్నారు. ప్రజాప్రతినిధిగా ఎన్నుకున్న తనకు గౌరవం దక్కలేదన్నారు. ప్రొటోకాల్ పాటించకుండా ప్రారంభోత్సవం చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే పాత శిలాఫలకాన్ని తొలిగించి, నూతన శిలాఫలకాన్ని ఏర్పాటు చేయాలని పీఆర్ అధికారులకు ఆయన పిర్యాదు చేశారు.

# రైతులు అధునాతన సాంకేతికతను వినియోగించాలి

- కో -ఆర్డినేటర్ డాక్టర్ మదన్ మోహన్‌రెడ్డి

వీర్నపల్లి, అక్టోబర్19: వ్యవసాయంలో రైతులు అధునాతన సాంకేతిక విధానాలను అంది పుచ్చుకోవాలని కోఆర్డినేటర్ డాక్టర మదన్ మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రైతువేదికలో జిల్లా ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో వ్యవసాయ గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రైతు ఉత్పత్తి దారుల సంఘం ప్రాముఖ్యాన్ని కూలంకషంగా వివరించారు. రైతు ఉత్పత్తి దారుల సంఘం లాభాలను కూడా వివరించారు. రాబోయే యాసంగిలో రైతులందరూ ఆరుతడి పంటలకు ప్రాధాన్యమివ్వాలని రైతులకు అధికారులు సూచించారు. ఎరువుల యాజమన్యం, వివిధ వంగడాలపై రైతులకు అవగహన కల్పించారు. ఈ సందర్భంగా రైతులు అడిగిన సమస్యలకు పరిష్కారాలు చూపారు. ఇక్కడ వ్యవసాయ శాస్త్రవేత్తలు, అసిస్టెంట్ ప్రొపెసర్లు, వ్యవసాయ విస్తరణ అధికారులు, వ్యవసాయ కళాశాల, పొలస విద్యార్థులు, రైతులు హాజరయ్యారు.


## ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియపరచటం ఏమనగా నా క్లయింట్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, సిరిసిల్ల శాఖ గారు. శ్రీ పొన్నాల శ్రీకాంత్, S/o వెంకట్ రెడ్డి, గొల్లపల్లి గ్రామం, ఎల్లారెడ్డిపేట మండలం, రాజన్న సిరిసిల్ల జిల్లా గారికి వ్యాపార నిమిత్తం ఋణ సదుపాయం కల్పించుచున్నారు. ఇట్టి విషయములో తన యొక్క స్వంత ఆస్తి అయిన ఖాళీ స్థలం ప్లాట్ నెం. 5, దీని యొక్క విస్తీర్ణం: 153.67 చ॥గ॥, దీని యొక్క సర్వే నెం. 1137/1, కిష్టంపల్లె రోడ్డు, ఎల్లారెడ్డిపేట గ్రామం మరియు మండలం, రాజన్న సిరిసిల్ల జిల్లా నా క్లయింట్‌కు పై ఋణ విషయములో తనఖాగా పెట్టి పై ఆస్తికి సంబంధించిన ఒరిజినల్ దస్తావేజులు అప్పగించినారు.కావున ఇట్టి ఆస్తిపై ఎవరికైనా ఎలాంటి హక్కులు కానీ ఆక్షేపనలు కానీ వ్యాజములు ఉన్నచో ఈ ప్రకటన వెలువడిన 7 దినముల లోగా తగు దస్తావేజులతో నా కార్యాలయమునకు వచ్చి సంప్రదించగలరు. లేనిచో ఎవరికి అభ్యంతరాలు లేవని ధృవీకరించబడును.

తేది: 19-10-2023 స్థలము: సిరిసిల్ల.

ఇట్లు: Sd/- పిన్నింటి అశోక్, అడ్వకేట్,
ఇ.నెం.3-7-852/1.
వావిలాలపల్లి,కరీంనగర్ సెల్: 9849331558

## భూమిక ఉమెన్స్ కలెక్టివ్

స్త్రీల మీద జరుగుతున్న హింసకి వ్యతిరేకంగా 1993 నుండి భూమిక ఉమెన్స్ కలెక్టివ్ పనిచేస్తోంది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో మహిళా, శిశు సంక్షేమ శాఖ సహకారంతో సఖి / వన్ స్టాప్ సెంటర్ ను భూమిక ఉమెన్స్ కలెక్టివ్ సంస్థ ద్వారా నవంబర్-2019 నుండి నిర్వహించడం జరుగుతుంది. సఖి కేంద్రం, రాజన్న సిరిసిల్ల నందు దిగువ ఉద్యోగం కొరకు తగిన అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరుచున్నది.

| క్ర. సం. | ఉద్యోగం | ప్రతి ఫలం (రూ.లలో నెలకు) | ఉద్యోగాల సంఖ్య | అర్హత |
|---|---|---|---|---|
| 01 | లీగల్ కౌన్సిలర్ (మహిళ అభ్యర్థులు మాత్రమే) | 25,000/- | 1 | **విద్యార్హత:** ఏదైనా గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుండి న్యాయ శాస్త్రం (లా) లో బ్యాచులర్ డిగ్రీ లేదా తత్సమాన అర్హత కలిగి ఉండాలి. స్థానిక మహిళా అభ్యర్థులు మాత్రమే అర్హులు. **అనుభవం:** మహిళల హింసాత్మక సమస్యలపై ప్రభుత్వ లేదా ప్రభుత్వేతర ప్రాజెక్టు/ప్రోగ్రాంలో జిల్లా స్థాయిలో పనిచేసిన కనీసం 3 సంవత్సరాల పని అనుభవం లేదా ఏదైనా న్యాయస్థానంలో వ్యాజ్యం చేసిన కనీసం 2 సంత్సరాల అనుభవం ఉన్న ఏదైనా ప్రాక్టీస్ చేస్తున్న న్యాయవాది. |

దరఖాస్తు చేసుకోవడానికి చివరి తేది 29-10-2023 వరకు మొబైల్ నెంబర్‌తో సహా అన్ని వివరాలతో కూడిన దరఖాస్తును **Email: bhumikahyd@gmail.com** కు పంపగలరు, భూమిక ఆఫీస్ నెంబర్: **040-27660173,** సఖి సెంటర్ నెంబర్: **08723-295181.**